

నేడు అంగన్వాడీల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం


పలు సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 17వ తేదీన ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.కళ్యాణి, డి.సుధ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, సహాయకులకు ఉద్యోగోన్నతులు కల్పించడానికి నిర్దిష్టమైన గైడ్‌లైన్స్ రూపొందించాలని డిమాండ్ చేశారు. గతేడాది సమ్మె సందర్భంగా అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడం లేదని విమర్శించారు.


మందకొడిగా రబీ సాగు

- సాధారణ విస్తీర్ణం 1,98,493 ఎకరాలు
- ప్రస్తుతం 1,23,460 ఎకరాలు
- పంటల సాగు 62 శాతమే
- వర్షాభావ పరిస్థితులతో గణనీయంగా తగ్గిన సాగు

రబీలో ఈ ఏడాది పంటల సాగు అంత ఆశాజనంగా లేదు. వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉండడంతో సాగు గణనీయంగా తగ్గిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రతి ఏడాది డిసెంబరులో కురిసే వర్షాలతో నేలలో తేమ శాతం పెరిగి అపరాల సాగుకు దోహదపడుతుంది. ఈ ఏడాది అంతగా వర్షాలు లేకపోవడంతో అపరాల సాగుపై తీవ్ర ప్రభావం చూపిందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. వేసిన పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. తమ పంటలకు వంశధార నీళ్లు విడిచిపెట్టాలంటూ రైతులు ప్రజాప్రతినిధులను కలుస్తున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి





రబీలో సాధారణంగా అన్నిరకాల పంటలు కలిపి మొత్తం 1,98,493 ఎకరాల్లో సాగవుతున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 1,23,460 ఎకరాల (62.20 శాతం) మేర సాగయింది. వరి సాగు పరిస్థితి దయనీయంగా ఉంది. రబీలో వరి సాధారణ సాగు 21,573 ఎకరాలు ఉండగా, ప్రస్తుతం 7.790 ఎకరాల్లో (36 శాతం) మాత్రమే వేయగలిగారు. రాగులు సాధారణ సాగు విస్తీర్ణం 5,155 ఎకరాలు ఉండగా 3,158 ఎకరాల్లో సాగవుతోంది.

అపరాల సాగుపై తీవ్ర ప్రభావం

డిసెంబరులో వర్షాలు పెద్దగా లేకపోవడంతో అపరాల సాగుపై తీవ్ర ప్రభావం చూపింది. నేలలో తేమ శాతం తక్కువగా ఉండడంతో మినుము, పెసర పంటలను వేయలేకపోయారు. రాగులు, పెసర, మినప పంటలు 61 శాతం చొప్పున సాగవుతున్నాయి. రబీలో రైతులు సాధారణంగా 39,240 ఎకరాల్లో పెసర పంట వేసే పరిస్థితి ఉండగా, ఇప్పటివరకు 23,783 ఎకరాల్లో వేయగలిగారు. మినప పంట సాధారణ సాగు 60,753 ఎకరాలు కాగా, ఇప్పటివరకు 37,175 ఎకరాల్లో సాగవుతోంది. నువ్వుల సాగు కూడా దారుణంగా ఉంది. సాధారణంగా 12,115 ఎకరాల్లో వేసే పరిస్థితి ఉండగా, ఇప్పటివరకు రైతులు 3,618 ఎకరాల్లో (30 శాతం) మాత్రమే వేయగలిగారు.

మిగిలిన పంటలదీ అదే పరిస్థితి

పొద్దుతిరుగుడు పంట 553 ఎకరాల్లో సాగవ్వాల్సి ఉండగా, 15 ఎకరాల్లో (3 శాతం) మాత్రమే వేయగలిగారు. చెరకు పంట సాధారణ సాగు 2,755 ఎకరాలు కాగా, ఇప్పటివరకు 255 ఎకరాల్లో (9 శాతం) మాత్రమే వేశారు.

ఆ మూడు పంటలు కాస్త నయం

వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా మొక్కజొన్న, కట్టె జనుము, వేరుశనగ పంటల సాగు పరిస్థితి కాస్త పర్వాలేదనిపిస్తోంది. మొక్కజొన్న పంట సాగు పరిస్థితి కాస్త బాగానే ఉంది. రబీలో సాధారణంగా 40,675 ఎకరాల్లో సాగవుతుండగా, ఇప్పటివరకు 40,015 ఎకరాల విస్తీర్ణంలో (88 శాతం) సాగయింది. కట్టెజనుము సాధారణ సాగు 2,808 ఎకరాలు కాగా 2,418 ఎకరాల్లో (86 శాతం) మేర సాగవుతోంది. మొక్కజొన్న పంటను రబీ సీజన్‌లో సాధారణంగా 10,485 ఎకరాల్లో రైతులు సాగు చేస్తుంటారు. ఇప్పటివరకు 7,930 ఎకరాల్లో (86 శాతం) పంటలు వేశారు.



ప్రచారం చేస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

ఊపందుకున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

దూసుకుపోతున్న పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరి

ప్రజాశక్తి - టెక్కలి

ఈనెల 27వ తేదీన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో ప్రచారం ఊపందుకుంది. ఎన్నికకు సమయం సమీపిస్తుండడంతో ఉపాధ్యాయ సంఘాల నాయకులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి ప్రచారం చేపడుతూనే, మరోవైపు ఉపాధ్యాయుల ఇళ్లకూ వెళ్లి ప్రచారం చేస్తుండడం గమనార్హం. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోటీలో పది మంది అభ్యర్థులు పోటీలో ఉన్నా ప్రధానంగా పోటీ పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి, పాకలపాటి రఘువర్మ, గాదె శ్రీనివాసులు నాయుడు మధ్యే పోటీ ఉంటుందని పలువురు విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుత ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ పనితీరుని, గతంలో ఎమ్మెల్సీగా రెండు పర్యాయాలు పనిచేసిన గాదె శ్రీనివాసుల నాయుడు పనితీరుని అంచనా వేసుకున్న ఉపాధ్యాయులు ఈసారి కోరెడ్ల విజయగౌరి వైపు మొగ్గు చూపుతున్నారు. అంపశయ్య మీద ఉన్న విద్యారంగాన్ని కాపాడుకునే యత్నంలో, విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే పలు జిఒల రద్దుకు పోరాటం చేయడంలో, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం, హక్కులపై ప్రభుత్వాన్ని కదిలించేలా చేయాల్సిన అవసరముందని ఉపాధ్యాయ సంఘాలు భావిస్తున్నాయి.

యుటిఎఫ్ అభ్యర్థిగా ప్రోగ్రెసివ్ డెమక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) బలపరచిన కోరెడ్ల విజయగౌరి ఉత్తరాంధ్ర ప్రాంతంలో పలు ప్రజాతంత్ర, ఉపాధ్యాయుల సమస్యలపైనా ఉద్యమాలు చేపట్టిన మహిళగా అందరిలోనూ మంచి గుర్తింపు పొందారు. ప్రభుత్వ, ప్రయివేటు స్కూల్స్‌లో సమస్యల అధ్యయనం, ప్రభుత్వాల విధానాల వల్ల విద్యారంగానికి జరగబోయే కష్ట, నష్టాలపై పలుమార్లు ఉత్తరాంధ్ర స్థాయిలో గొంతెత్తిన చరిత్ర ఆమెకు ఉంది.

రాష్ట్రంలోనే పిడిఎఫ్ అభ్యర్థులందరూ ఉద్యమాభిలాషతో ముందుకు సాగిన వారే అయినందున టీచర్ల నుంచి ఈమెకు మంచి స్పందన లభిస్తోంది. ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ బరిలో పాకలపాటి రఘువర్మ, గాదె శ్రీనివాసులనాయుడు శాసన మండలి సభల్లో ఉపాధ్యాయుల తరపున గొంతెత్తాల్సిన వీరు పాలక పక్షాలకు భజన చేస్తూ 'ఇద్దరూ ఇద్దరే' అనేలా వ్యవహరించడం టీచర్లందరిలోనూ తాజాగా చర్చ సాగుతోంది. ప్రస్తుత ఎన్నికల్లో 'కూటమి పార్టీల మద్దతు నాకంటే నాకు అనుకుంటూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీని సైతం వీరు రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇలా పోటీ పడి ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వారికి వత్తాసుగా నిలవడమే వ్యాపకంగా మారిపోయింది.

జాతీయ విద్యావిధానం పేరుతో ఢిల్లీ నుంచి రాష్ట్రాల విద్యాహక్కులను, విద్యారంగాన్ని కార్పొరేటీకరణ చేస్తున్న బిజెపికి చెందిన విశాఖ నాయకుడు పివిఎన్.మాధవ్ ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గాదె శ్రీనివాసులునాయుడుకు మద్దతుగా నిలబడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో మోడీ విధానాల అడుగులకు మడుగులొత్తుతూ విద్యా వ్యవస్థను కలుషితం చేసేందుకు సిద్ధమైన టిడిపి తరపున పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు రఘువర్మకు మద్దతుగా నిలిచారు. పిడిఎఫ్ అభ్యర్థుల ఉద్యమ స్ఫూర్తితో కోరెడ్ల విజయగౌరి ముందుకు సాగుతున్నారు. ఆమె విజయంతోనే తమ సమస్యలు పరిష్కారం కావచ్చనే అంచనాలో ఉపాధ్యాయులు ఉన్నారు. ప్రచారంలో ఆమె కూడా దూసుకుపోతున్నారు.

థర్మల్ ప్లాంట్‌తో అభివృద్ధి బూటకం

ప్రజాశక్తి - బూర్జ, సరుబుజ్జిలి

థర్మల్ పవర్ ప్లాంట్‌తో అభివృద్ధి సాధ్యమని చెప్పడం బూటకమని మానవ హక్కుల వేదిక తెలుగు రాష్ట్రాల కన్వీనర్ వి.ఎస్ కృష్ణ అన్నారు. సరుబుజ్జిలి, బూర్జ మండలాల్లో థర్మల్ పవర్‌ప్లాంట్ ప్రతిపాదిత గ్రామాలైన వెన్నెలవలస, మసనపుట్టి, బొట్లపాడు, తిమ్మడం, జంగాలపాడు తదితర గ్రామాల్లో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చని పంట భూములతో, ఆదివాసీలు పోడు భూములు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ప్రాంతంలో థర్మల్ ప్లాంట్ ఏర్పాటు మానవాళి మనుగడకు ప్రమాదమన్నారు. కార్బన్ ఉద్గారాలు తగ్గించాలని ప్రపంచ దేశాలు తీర్మానం చేసుకున్న తరుణంలో థర్మల్ పవర్ ప్లాంట్ తీసుకొస్తానని ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. కార్బన్ డైయాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్ వంటి విషతుల్య కార్బన్ ఉద్గారాలను వెదజల్లే థర్మల్ ప్లాంట్‌తో అభివృద్ధి ఎలా సాధ్యమో చెప్పాలని ప్రశ్నించారు. పవర్ ప్లాంట్ ఈ ప్రాంతంలో నిర్మించే ప్రయత్నాన్ని పాలకులు విరమించుకునేంత వరకు ప్రజలు పోరాటానికి ముందువరుసలో ఉండాలని పిలుపునిచ్చారు. పోరాటానికి, పర్యావరణ పరిరక్షణకు మానవ హక్కుల వేదిక ప్రజల పక్షాన నిలబడుతుందన్నారు. కార్యక్రమంలో వేదిక రాష్ట్ర అధ్యక్షులు కె.వి జగన్నాథం, అనురాధ, జిల్లా కార్యదర్శి సురేష్, ఉత్తరాంధ్ర జర్నలిస్టుల సంఘం నాయకులు లక్ష్మణరావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి, థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షులు సురేష్ దొర, కార్యదర్శి రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మానవ హక్కుల వేదిక కన్వీనర్ కృష్ణ



ప్రచారం చేస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

అవకాశమిస్తే అండగా ఉంటా...

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే శాసనమండలిలో ఉపాధ్యాయుల గొంతు వినిపించి వారికి అండగా ఉంటానని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. శ్రీకాకుళం జిల్లాలోని శ్రీకాకుళం నగరం, ఆమదాలవలసలోని పలు ప్రాంతాల్లో ఉపాధ్యాయ సంఘ నాయకులు, ఉపాధ్యాయుల ఇళ్లకు వెళ్లి ఆదివారం విస్తృత ప్రచారం చేశారు. విద్యారంగ పరిరక్షణకు 17 ఏళ్లుగా పిడిఎఫ్ ఎమ్మెల్సీలు నిర్విరామంగా కృషి చేశారని, తాను గెలిస్తే అదే స్ఫూర్తితో పని చేస్తానని చెప్పారు. ఉపాధ్యాయుల పిఆర్‌సి సమస్యపైనా, హక్కులు, విద్యారంగ పరిరక్షణ కోసం నికరంగా పోరాడుతున్న యుటిఎఫ్, ఇతర ఉపాధ్యాయ సంఘాలు తనను బలపరుస్తున్నట్టు తెలిపారు. గతంలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా పనిచేసి, ప్రస్తుతం అభ్యర్థులుగా ఉన్న ఇద్దరు ఉపాధ్యాయ సమస్యలను పక్కనపెట్టి అధికార పార్టీ ప్రభుత్వాలతో అంటకాగారని, ఉపాధ్యాయుల హక్కులను తాకట్టు పెట్టి వారి సొంత ప్రయోజనాల కోసమే పని చేశారని గుర్తు చేశారు. తన 34 ఏళ్ల ఉపాధ్యాయ సర్వీసులో ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేస్తూ ఉద్యమాలతోనే నడిచానని గుర్తుచేశారు. తనను గెలిపించి శాసనమండలికి పంపిస్తే మండలిలో ఉపాధ్యాయ, అధ్యాపకులు గొంతుకునవుతానన్నారు. తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్, చౌదరి రవీంద్ర, గొంటి గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

మెమో 57ను వర్తింపజేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం డిఎస్‌సి-2003తో పాటు పలు ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్ ఇచ్చి 2005లో నియామకాలు చేపట్టడంతో రాష్ట్రవ్యాప్తంగా 11వేల మంది ఉపాధ్యాయ, ఉద్యోగులను సిపిఎస్‌లోకి నెట్టిందని డిఎస్‌సి-2003 ఎపి ఫోరం అధ్యక్షులు మోపిదేవి శివశంకర్ తెలిపారు. నగరంలోని శాంతినగర్ కాలనీలో గల కళింగ భవన్‌లో డిఎస్‌సి-2003 ఉత్తరాంధ్ర ఫోరం సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన మెమో నంబరు 57ను 11వేల మంది ఉద్యోగులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. 2003 డిఎస్‌సి నోటిఫికేషన్ 2003 నవంబర్ 13న విడుదలైనా, నియామకాలు 2005 నవంబరులో చేపట్టి రెండేళ్లు ఆలస్యం చేసిందన్నారు.

పాఠశాల విద్యాశాఖ పరిధిలో 7,361 మంది ఉపాధ్యాయులు, హోంశాఖ పరిధిలో 1800 మంది పోలీసు కానిస్టేబుళ్లు, గ్రూప్-2, గ్రూప్-1, వైద్యారోగ్యశాఖకు చెందిన 1800 మందిని బలవంతంగా సిపిఎస్ విధానంలోకి నెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57ను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వర్తింపజేసి, పాత పెన్షన్ విధానంలోకి మార్చాలని డిమాండ్ చేశారు.

ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం మాట్లాడుతూ ఇది ఆర్థిక భారమైన డిమాండ్ కాదని, ప్రభుత్వం మెమో 57 ప్రాప్తికి పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలన్నారు. అందుకవసరమైన పోరాటానికి పూర్తి మద్దతు ఇస్తామన్నారు. సమావేశంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు దుప్పల శివరాం ప్రసాద్, కొత్తకోట శ్రీహరి, సుబ్బారెడ్డి, రవి, షేక్ అహ్మద్, ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి, ఎపిటిఎఫ్ 1938 రాష్ట్ర అధ్యక్షులు హృదయరాజు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్, గొంటి గిరిధర్, చౌదరి రవీంద్ర, ఇతర సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

ఆరో రోజుకు రైస్‌మిల్లు కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - మందస



ఛార్టర్ ఆఫ్ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ రైస్‌మిల్లు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారానికి ఆరో రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా సిద్ధిగాం, ఆర్‌ఎస్‌కె పురం, సారంగపురంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. వేతన సవరణ చేయాలని, పిఎఫ్, ఇఎస్‌ఐ అమలు చేయాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ కె.కేశవరావు మాట్లాడుతూ వేతన సవరణ చేయాలని కోరుతూ యాజమాన్యాలను ఎనిమిది నెలల కిందట నోటీసు ఇచ్చినా స్పందన లేదని విమర్శించారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో కార్మికులు సమ్మెకు దిగాల్సి వచ్చిందన్నారు. కార్మికులకు అమలు చేయాల్సిన పిఎఫ్, ఇఎస్‌ఐ వంటి పథకాలనూ అమలు చేయడం లేదని విమర్శించారు. వేతన సవరణ చేసేందుకు ముందుకు రాకుండా కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. యాజమాన్యాల మొండివైఖరే కార్మికులకు సమ్మెలోకి నెట్టిందన్నారు. యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కార్మిక హక్కులను ఉల్లంఘిస్తున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా కార్మికుల న్యాయబద్ధమైన డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైస్ మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

కోటబొమ్మాళి : అర్హత ఉన్న వారందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని నిమ్మాడలో గల తన క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. టెక్కలి నియోజకవర్గంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలను మంత్రికి విన్నవించుకోగా, సంబంధిత అధికారులతో మాట్లాడి వీలున్నంత త్వరగా ప్రజలకు మేలు చేసే విధంగా సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలసత్వం లేకుండా విధులు నిర్వహించాలని సూచించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. ఇళ్లు, పింఛన్లు, ఉపాధి అవకాశాలు, రోడ్లు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన నిధులు ఉన్నాయని, ఇప్పటికే మంజూరు చేయడమైందని చెప్పారు. పనులు పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

నేడు జర్నలిస్టుల నిరసన

శ్రీకాకుళం : తమకు వ్యతిరేకంగా వార్తలు రాశారనే అక్కసుతో ప్రజాశక్తి పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండల విలేకరి రామారావుపై టిడిపి మండల అధ్యక్షుడు దాడి ఘటనను నిరసిస్తూ ఈనెల 17వ తేదీన నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.వేణుగోపాల్, జిల్లా కార్యదర్శి జి.లక్ష్మణరావు, టి.భీమారావు, మీడియా జెఎసి జిల్లా అధ్యక్షులు ఎస్.జోగినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని అంబేద్కర్ కూడలి వద్ద ఉదయం పది గంటలకు చేపట్టే నిరసన కార్యక్రమానికి పెద్దసంఖ్యలో జర్నలిస్టులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

జిజిహెచ్‌లో మెరుగైన వైద్యసేవలు

- ప్రభుత్వ వైద్యంపై పెరుగుతున్న నమ్మకం
- తగ్గిన రిఫరల్ కేసులు
- శస్త్రచికిత్సలకు ఆధునిక సాంకేతిక పరికరాలు
- సూపరింటెండెంట్ డాక్టర్ దాసరి షకీల

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ దాసరి షకీల తెలిపారు. నైపుణ్యం గల సీనియర్ వైద్యులు శస్త్రచికిత్సలు చేస్తున్నట్లు చెప్పారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాలకూ ఆధునిక సాంకేతిక పరికరాలు, సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. నాణ్యమైన వైద్య సేవలతో ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం పెరుగుతోందన్నారు. 'ప్రజాశక్తి' ముఖాముఖిలో జిజిహెచ్‌లో వైద్యసేవలను వివరించారు.

? వైద్య సేవల మెరుగుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో వైద్యం కోసం వచ్చే వారికి మెరుగైన వైద్యం అందించేందుకు వైద్యులు కృషి చేస్తున్నారు. ఫలితంగా ఇన్ పేషెంట్, అవుట్ పేషెంట్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం ప్రతిరోజూ 450 నుంచి 500 మంది వరకు ఇన్‌పేషెంట్లు వస్తున్నారు. ప్రసూతి విభాగంలో రికార్డుస్థాయిలో ప్రసవాలు, శస్త్రచికిత్సలు చేస్తున్నాం. ఇంకా కొన్ని విభాగాలు నెలకొల్పాల్సి ఉంది. ప్రధానంగా జిల్లాలో కిడ్నీ వ్యాధులతో పాటు కేన్సర్ రోగుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. రిమ్స్‌లో ఏకైక సూపర్ స్పెషాలిటీ నెఫ్రాలజీ మాత్రమే అందుబాటులో ఉంది. న్యూరో మెడిసన్, సర్జన్, ప్లాస్టిక్ సర్జరీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ వంటి విభాగాలు రావాల్సి ఉంది. ప్రస్తుతం రోగికి ఎటువంటి సమస్య ఎదురైనా శస్త్రచికిత్సల ద్వారా నయం చేసేందుకు వీలుంది. ప్రభుత్వం సూపర్ స్పెషాలిటీ విభాగాలను ప్రారంభించడానికి అనువైన అన్ని అర్హతలు ఉన్నాయి.

? సూపర్ స్పెషాలిటీ సేవల పరిస్థితి ఎలా ఉంది?

జిల్లాలో సాధారణ వ్యాధులతో వచ్చే వారికంటే దీర్ఘకాలిక రోగాలతో వచ్చే వారే ఎక్కువగా ఉన్నారు. వారు కొంత నిర్లక్ష్యంగా ఉండడం, అవగాహనా లోపం వల్ల ఆలస్యంగా వైద్యుల వద్దకు వచ్చి పరీక్షలు చేయించుకుంటారు. అందువల్ల ఎక్కువగా నష్టం వాటిల్లే ప్రమాదం ఉంటోంది. తీవ్రస్థాయిలో ఉన్నప్పుడు రోగాన్ని నయం చేయాలంటే ఆధునిక పరికరాలు అవసరమవుతాయి. అటువంటి సౌకర్యాలు జిల్లాలో అందుబాటులో లేకపోవడం వల్ల ఇతర జిల్లాలకు పంపాల్సి వస్తోంది. సూపర్ స్పెషాలిటీ సేవలు మినహా మిగతా విభాగాల్లో రిఫరల్ కేసులు తగ్గాయి. ప్రస్తుతం నెఫ్రాలజీ మినహా మిగిలిన సూపర్ స్పెషాలటీ సేవలు అందుబాటులో లేవు. జనరల్ సర్జన్, జనరల్ మెడిసన్, గైనిక్, ఆర్థో, ఇఎన్‌టి, చర్మ వ్యాధులకు సంబంధించిన విభాగాలు సమర్థవంతంగా సేవలు అందిస్తున్నారు. సూపర్ స్పెషాల్టీ సేవల్లో గ్యాస్ట్రో ఆంత్రాలజీ, ప్లాస్టిక్ సర్జన్, న్యూరో జనరల్, న్యూరో సర్జన్, గుండె, శ్వాసకోశ రోగులకు శస్త్రచికిత్సలు అందించేందుకు వైద్య నిపుణులు ఉన్నారు. సూపర్ స్పెషాల్టీలో మరిన్ని విభాగాలు వస్తే పిజి సీట్లు పెరుగుతాయి.

? మౌలిక వసతులు ఎంతమేరకు అందుబాటులోకి వచ్చాయి?

రిమ్స్ వైద్య కళాశాలకు జిజిహెచ్ అనుబంధ ఆస్పత్రిగా ఉంది. కళాశాలలో కొత్తగా పిజి విద్యతో పాటు యుజికి 150 సీట్లను ఏటా భర్తీ చేయడమవుతోంది. వారికి వేర్వేరుగా హాస్టల్ వసతులు ఉన్నాయి. స్థానికంగా ఉండే వైద్యులు మినహా మిగిలిన వారికి క్వార్టర్స్ కాంపౌండ్ లోపలే ఉండడం వల్ల రాత్రివేళల్లో అత్యవసర సేవలు అందించడానికి వీలువుతోంది. ఈఏడాది కొత్త బ్లాక్‌ల నిర్మాణం జరుగుతోంది. ఒపి, లైబ్రరీ కోసం కొత్త భవనం అందుబాటులోకి తీసుకొచ్చాం. అదనంగా మరికొన్ని భవన నిర్మాణాలు చేపడుతున్నాం.





? వైద్యుల సమయపాలనకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

వైద్యులు, ఉద్యోగులు సమయపాలన తప్పనిసరి. అందుకోసం బయోమెట్రిక్‌తో పాటు ఎఫ్ఆర్ఎస్ అమల్లో ఉంది. విధుల్లో ఉన్నంతసేపు క్లోజ్ మోనటరింగ్ జరుగుతోంది. మధ్యాహ్నం సమయంలో ఎవరైనా వెళ్తే వారికి కచ్చితంగా హాజరు నమోదు జరగదు. ఎఫ్ఆర్ఎస్ ఆస్పత్రి ఆవరణలో ఉంటే తప్ప వేసేందుకు వీలుండదు. కళాశాల, ఆస్పత్రి సమన్వయంతో పనిచేయడం వల్ల మెరుగైన వైద్యం అందుబాటులో ఉంది.

? ఆస్పత్రిలో సౌకర్యాల మెరుగుకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రోగులకు అవసరమైన అన్నిరకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. ఇంకా కొన్ని సమకూర్చుకోవాల్సి ఉంది. క్యాంటీన్, లైబ్రరీ, అదనపు వసతి గృహ సముదాయంతో పాటు తాగునీటి సమస్య పరిష్కరించాల్సి ఉంది. ఉన్నతాధికారుల దృష్టికి వీటిని తీసుకెళ్లాం. మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్ సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవలే దాతల సహకారంతో ఫ్యాన్లు, స్టక్చరల్ సామగ్రి అందించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

రెండు రోజులుగా నిలిచిన నీటి సరఫరా

ప్రజాశక్తి- టెక్కలి

పట్టణంలో పంచాయతీ ఆధ్వర్యంలో కొళాయిల ద్వారా జరుగుతున్న నీటి సరఫరా రెండురోజులుగా నిలిచిపోయింది. కుళాయిల ద్వారా సరఫరా జరుగుతున్న తాగునీటి సంరక్షణ నీటి ట్యాంక్‌లో రెండు రోజుల క్రితం ఒక వ్యక్తి పడి మరణించడంతో నీటిని శుద్ధి చేసే క్రమంలో తాగునీటి సరఫరా నిలిపివేశారు. ప్రస్తుతం సరఫరా జరుగుతున్న వాటర్ ట్యాంక్‌లను శుభ్రపరిచే క్రమంలో తాగునీటి సరఫరా విభాగం అధికారులు, పంచాయతీ అధికారులు నిమగ్నమైనప్పటికీ పనులు ఇంకా పూర్తి కాలేదు. దీంతో సోమవారం నాటికైనా కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా జరుగుతుందో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. రెండు రోజులుగా కొళాయిల ద్వారా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తాగునీటి కోసం పలు అవస్థలకు గురయ్యారు. మెట్టవీధి, సర్వమంగళవీధి, అక్కపువీధి, కంద్రవీధి, చేరి వీధి, ఆదిఆంధ్రా వీధి, గందరగోళం వీధులకు చెందిన ప్రజలు నీటికోసం పలు ఇబ్బందులకు గురయ్యారు. అధికారులు పూర్తిస్థాయిలో దృష్టిసారించి త్వరితగతిన తాగునీరందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


ఎర్రన్నాయుడు ఘాట్‌ను పరిశీలిస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు

ఎర్రన్నాయుడు ఘాట్ సందర్శన

కోటబొమ్మాళి: కేంద్ర పౌరవిమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడులు తన కుటుంబసభ్యులతో కలిసి మండలం నిమ్మాడలో గల దివంగత నేత, మాజీ కేంద్రమంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు ఘాట్‌ను ఆదివారం సందర్శించారు. ఈనెల 23న ఎర్రన్నాయుడు 67వ జయంతి సందర్భంగా జరగనున్న ఏర్పాట్లుపై కుటుంబసభ్యులతో కలిసి చర్చించారు. వీరితో పాటు టిడిపి నాయకులు, కుటుంబసభ్యులు కింజరాపు హరివరప్రసాద్, కింజరాపు ప్రభాకర్‌రావు, మెండ దాసునాయుడు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


భీమారావు దంపతులను సత్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

లక్ష్యసాధనకు కృషి

ప్రజాశక్తి- నరసన్నపేట

లక్ష్యాన్ని నిర్దేశించుకొని, అంకిత భావంతో చదివితే ఎలాంటి వారైనా ఉన్నత స్థాయిలో ఉంటారని ఒడిశా బిజు పట్నాయక్ విశ్వవిద్యాలయం విశ్రాంత ప్రొఫెసర్, భువనేశ్వర్ శిష్టకరణ సంఘం అధ్యక్షులు డాక్టర్ ఆర్. భీమారావు అన్నారు. ఆదివారం స్థానిక శిష్టకరణ సంఘం భవనంలో ఎమ్.వి.జె.మోహనరావు అధ్యక్షతన జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారయా సందర్భంగా శ్రీకాకుళం జిల్లా శిష్టకరణ సంఘం ప్రధాన కార్యదర్శి, సదాశివుని కృష్ణ మాట్లాడుతూ భారత ప్రభుత్వంచే అనేక పురస్కారాలు, సత్కారాలు పొందిన రఘుపాత్రుని భీమారావును చూసి ప్రతి పౌరుడు గర్వ పడాలన్నారు. శాస్త్రవేత్తగా పరిశోధకులుగా ఆయన సాధించిన ఫలితాలకు దేశం గర్వపడుతుందన్నారు. అధ్యక్షులు ఎం.వి.జె.మోహనరావు, సదాశివుని ప్రభాకరరావు, రఘుపాత్రుని బుజ్జి, అంపలాం వసంత కుమార్. విజయలక్ష్మి, కప్ప ప్రసాద్, బూరవెల్లి భాస్కరరావు తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా రఘుపాత్రుని భీమారావు, ఆయన సతీమణి ఆశాపట్నాయక్‌లను నూతన వస్త్రాలతో ఘనంగా సత్కరించారు.


వివాహ వేడుకలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు

ఘనంగా ఎమ్మెల్యే కుమారుని వివాహం


ప్రజాశక్తి- పాతపట్నం

పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తనయుడు మామిడి జై ప్రకాష్, వైష్ణవిల వివాహం పాతపట్నంలో అమ్మవారి గుడి ఎదురుగా ఉన్న కల్యాణ వేదికలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ, మాజీ కేంద్రమంత్రి కిల్లి కృపారాణి, జనసేన నాయకురాలు కొరికాన భవాని, బిజెపి జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు, తదితర నాయకులు వచ్చి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకలో నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలు అధికారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే సినీగాయని సునీత పాటలను ఆలపించారు.

సేవా కార్యక్రమాలతో ఆదుకుంటాం

ప్రజాశక్తి- రణస్థలం

రణస్థలం హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి ఆదుకుంటామని రణస్థలం హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు కరిమజ్జి కాశీబాబు తెలిపారు. ఆదివారం రణస్థలంలో హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రారంభించారు. ఈ సందర్భంగా కాశీబాబు మాట్లాడుతూ పేదరికంలో ఉండి చదువుకోలేని విద్యార్థులకు చేయూతనిస్తూ, వారి ఆర్థిక పరిస్థితులను బట్టి నిరుపేద కుటుంబాలను ఆదుకునేందుకు రణస్థలంకు చెందిన యువకులంతా కలిసి ఈ సంస్థ ప్రారంభించినట్లు తెలిపారు. ముందుగా గ్రామ పైడితల్లి అమ్మవారును దర్శించుకుని దుర్గా మాత ఆలయం, శివాలయం ఆలయం ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. మొదటి సేవ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తురాలు మండల పైడమ్మ గత కొన్ని సంవత్సరాలుగా కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న కారణంగా వారికి మందుల ఖర్చుల నిమిత్తం ఆర్థికసాయం చేశారు. రణస్థలం హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సేవ ప్రారంభించడం, యువకులు ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడానికి ముందుకు రావడం చాలా సంతోషంగా ఉందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.


పైడమ్మకు ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

అపరాల దిగుబడి తగ్గుదల

- అనుకూలించని వాతావరణ పరిస్థితులు
- అన్నదాత ఆశలపై సోకిన తెగుళ్లు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఖరీఫ్ పంటలు సాగు చేసిన రైతులు సీజన్ ముగిసిన వెంటనే రబీ సాగుకు సిద్ధం అయ్యారు. ఎన్నో ఆశలతో పెసర, మినుము, రాగి పొద్దితిరుగుడు, నువ్వు, వేరుశెనగ, గిలక ఇతర అపరాల పంటలను సాగు చేస్తున్నారు. పంట సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఇతర పెట్టుబడుల కోసం వేలాది రూపాయలు ఖర్చు చేశారు. అయితే పంట ప్రారంభంలో కొంతమేర వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో పంట దిగుబడిపై ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా గత కొంతకాలంగా వాతావరణంలో వచ్చిన పెను మార్పులు పంట దిగుబడిపై రైతులు ఆందోళన చెందుతున్నారు. పొగ మంచు, తేనే మంచుతో పాటు సాగునీరు సకాలంలో అందకపోవడంతో పంటలకు అనేక రకాల తెగుళ్ళు, పురుగులు ఆశించడంతో తీవ్ర ముప్పు వాటిల్లిందని దీంతో పంట దిగుబడిపై తాము పెట్టుకున్న ఆశలు నీరుగారాయని రైతులు వాపోతున్నారు. పలాస నియోజకవర్గంలో గల వజ్రపుకొత్తూరు, మందస, పలాస మండలాల్లో గల లక్ష్మీపురం, బ్రహ్మణతర్లా, గరుడఖండి, గోవిందపురం, మహాదేవపురం, బట్టుపాడు, సీతాపురం, బెండి, నగరంపల్లి, కొండవూరు, రిట్టపాడు, మకరజ్యోల, విజిపురం, హరిపురం, కుంటికోట, పితాతోళి, గుళ్లలపాడు, అనంతగిరి, గల్లి, పాత టెక్కలి తదితర గ్రామాల్లో రైతులు సుమారు 4 వేల ఎకరాల్లో అపరాల పంటలను సాగు చేశారు. అయితే ఎన్నో ఆశలతో సాగుచేసిన పంటలపై వాతావరణ ప్రతికూల పరిస్థితుల ప్రభావం తీవ్రంగా ఉండటంతో పంట దిగుబడి ఆందోళనకరంగా మారింది. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో పంట తాము ఆశించిన స్థాయిలో దిగుబడి లేదు. ప్రస్తుతం మినుము, పెసర పంటలను చూస్తుంటే ఆందోళనగా ఉంది. పంటల సాగుకు వేలాది రూపాయాలు ఖర్చుపెట్టాం. పంట దిగుబడి చూస్తే ఇలా ఉంది. ఈ ఏటా పెట్టిన పెట్టుబడి వచ్చినట్టు లేదని గోవిందపురానికి చెందిన రైతు పాలిన అప్పారావు అవేదన వ్యక్తం చేశారు.


దిగుబడి తగ్గిన మినప పంట


డార్మెటరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

డార్మిటరీ ప్రారంభం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దూర ప్రాంతాల నుంచి వైద్యం కోసం వచ్చే రోగులతో పాటు వారిని చూసేందుకు వచ్చే వారికి రాత్రిపూట బస చేసేందుకు అసౌకర్యంగా ఉంటుందని, ఇది గమనించి లాభాపేక్ష కాకుండా సేవా దృక్పథంతో డార్మిటరీని ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఆదివారం నగరంలో కిమ్స్ ఆస్పత్రి సమీపాన ఏర్పాటు చేసిన వెంకటేశ్వర డార్మిటరీని ఆయన ప్రారంభించారు. యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి నాయకురాలు సీపాన రమ, డార్మెటరీ నిర్వహకులు పాల్గొన్నారు.


పరిమితికి మించి వైద్యం చేయొద్దు

టెక్కలి: గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం అందించే వారు తమ పరిమితికి మించి వైద్యం చేయవద్దని ఆర్‌ఎంపిల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తారు రాజశేఖర్ అన్నారు. ఆదివారం స్థానిక ప్రయివేట్ కళ్యాణ మండపంలో వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత వైద్యులు అందించే ప్రాథమిక వైద్యం కీలకమైందన్నారు. యూరాలజీ వైద్యులు సందీప్‌వర్మ మాట్లాడుతూ కిడ్నీలో రాళ్లు, వయస్సు పైబడిన వారికి వస్తున్న యూరాలజీ సమస్యలు వంటి వాటిపై ప్రథమ చికిత్స ఏ విధంగా అందివ్వాలో వివరించారు. సంఘ జిల్లా అధ్యక్షులు తర్లా భాస్కరరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత వైద్యుల్లో ఐక్యత అవసరమన్నారు. ఈ సమావేశంలో ఏరియా కమిటీ కార్యదర్శి టి.యాదవరావు, రమణమూర్తి, శివ, ఆమంచి వెంకటరావు, బమ్మిడి కూర్మారావు, బందపల్లి రాకేష్, దీనబంధు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.


పోటీ పరీక్షల పుస్తకాలను ప్రదర్శిస్తున్న యువతీ, యువకులు

గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ

ఆమదాలవలస : పట్టణంలోని 18వ వార్డు బొడ్డేపల్లి పేటలో ఉన్న ఆమదాలవలస శాఖా గ్రంథాలయానికి అదే వార్డుకు చెందిన టిడిపి మాజీ కౌన్సిలర్ బొడ్డేపల్లి లక్ష్మణరావు తన వంతు సహాయంగా పుస్తకాలను అందించారు. వార్డులో ఉన్న నిరుద్యోగ యువతీ యువకులకు వివిధ పోటీ పరీక్షల నిమిత్తం ఈ పుస్తకాలు అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. సుమారు రూ.4 వేలు విలువ చేసే పోటీ పరీక్షల పుస్తకాలను గ్రంథాలయానికి అందించారు. వార్డులో ఉన్న వివిధ ప్రాంతాల్లో ఉద్యోగం చేస్తున్న వ్యక్తులు, దాతలు గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలని గ్రంథాలయ అధికారి అంపోలు కోటేశ్వరరావు కోరారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతీ, యువకులు పాల్గొన్నారు.


ద్రవ జీవామృతం తయారు చేస్తున్న రైతులు

ద్రవ జీవామృతం తయారీ

ఆమదాలవలస: మండలంలోని చేపేనపేట యూనిట్ పరిధిలోని నిమ్మతొర్లవాడలో చెరుకు పంట కోసం రైతులు సామూహికంగా వెయ్యి లీటర్ల ద్రవ జీవామృతం తయారు చేసుకున్నారు. ఈ సందర్భంగా డిజిటల్ యల్‌టు సురేష్ మాట్లాడుతూ యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవి కాంపాక్ట్ బ్లాక్ రైతులచే సామూహికంగా ద్రవ జీవామృతం తయారు చేయించారన్నారు. ద్రవ జీవామృతాన్ని ఒకేసారి చెరుకు పంటకు ఇవ్వడం వలన పంటకు అవసరమైన సూక్ష్మ పోషకాలు సమృద్ధిగా అంది పంట సస్యరక్షణకు ఉపయోగపడి మంచి దిగుబడులు వస్తున్నాయన్నారు. రైతులు క్షేత్రస్థాయిలో ద్రవ జీవామృతం ఉపయోగాలు తెలుసుకొని విరివిగా తయారు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కృష్ణవేణి, రైతులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సమాజంలో అట్టడుగున ఉండి చదువుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డుగా ఉన్న నిరుద్యోగ యువతను ఆదుకునేందుకు తూర్పు కాపుఉద్యోగుల సంఘం చేయూత నిస్తోందని సంఘం అధ్యక్షులు డాక్టర్ ఎం. రామ జోగినాయుడు అన్నారు. ఆదివారం కానిస్టేబుల్ రాత పరీక్షలకు హాజరవుతున్న నిరుపేదలైన తూర్పుకాపు విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీయల్‌ను నగరంలోని తూర్పుకాపు సంక్షేమ భవన్‌లో వీటిని అందజేశారు. ప్రైవేటు హాస్టల్‌లో ఉండి వేలకు వేలు ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండా భోజన వసతి సౌకర్యాలను కల్పిస్తున్నట్టు తెలిపారు. రానున్న డిఎస్‌సి అభ్యర్థులకు ఈ సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొచ్చా మన్నారు. నూతనంగా సాగుతున్న సంక్షేమ భవనంలో విద్యార్థుల కోసం ప్రత్యేక గదులు ఏర్పాటు చేస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా తూర్పుకాపు ఉద్యోగ సంక్షేమ సంఘం ప్రతినిధులు కిల్లారి నారాయణరావు, పడాల తమ్మునాయుడు, పతివాడ సురేష్., కురిటి దుర్గారావు, అంకడాల తవిటన్న., వాళ్ళ శ్రీరాములు నాయుడు, దన్నాన మోహనరావు, లావేటి సుందరరావు తదితరులు పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న రామజోగి నాయుడు

టీచర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టంపై కసరత్తు!

- బదిలీల క్రమబద్ధీకరణకు సర్వే
- ఎంఇఒలకు బాధ్యతలు అప్పగింత

శ్రీకాకుళం అర్బన్ : ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో క్షేత్రస్థాయిలో సమస్యలు తలెత్తకుండా కార్యాచరణ ప్రణాళిక రూపొందించడానికి వీలుగా రానున్న వేసవి సెలవుల్లోగా టీచర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టంను రూపొందించడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే దీనిపై అధికారుల బృందం తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో పర్యటించి అక్కడ చట్టాలను పరిశీలించిన అధికారులు క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయుల ఇబ్బందులు తొలగించేందుకు కసరత్తు ప్రారంభించారు. సాధారణ బదిలీల్లో పలు సమస్యలతో ఉపాధ్యాయులు అవస్థలు పడుతుండగా, గడచిన ఐదేళ్లలో రాజకీయ బదిలీలు తప్ప సాధారణ బదిలీలు లేవు. ఈ ఏడాది వేసవిలో తిరిగి సాధారణ బదిలీలు చేపట్టేందుకు వీలుగా పాఠశాల విద్యాశాఖ ఉపాధ్యాయుల పూర్తి వివరాలను సేకరిస్తోంది. టీచర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టం (టిఐఎస్)లో ఉపాధ్యాయుల వివరాల నమోదులో ఎటువంటి తప్పులకు తావులేకుండా పర్యవేక్షణ బాధ్యతలను డిఇఒలకు అప్పగించింది. అందులో ఉపాధ్యాయుల సర్వీసు వివరాలు, పాఠశాలల్లో పనిచేసిన సర్వీసు, ఇతర వివరాల నమోదు జరగనుంది.

జిల్లాలో ఉన్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, మున్సిపల్ పాఠశాలల్లో పని చేస్తున్న మొత్తం ఉపాధ్యాయుల వివరాలు నమోదు చేస్తున్నారు. ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించాలన్నా, డిఎస్‌సి పరీక్షలు నిర్వహించాలన్నా ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయుల సర్వీసు వివరాలు, వారి సీనియారిటీ, రోస్టర్ పాయింట్లు వంటి పలు అంశాలు ముడిపడి ఉంటాయి. సీనియారిటీ జాబితాలను అధికారులు ప్రస్తుతం సిద్ధం చేస్తున్నారు. ఉపాధ్యాయుల నుంచి వారి విద్యార్హత, డిఎస్‌సి పోటీ పరీక్షలో లభించిన మార్కులు తదితర వివరాలను అన్ని మండలాల్లో ఎంఇఒలు సేకరిస్తున్నారు. వివిధ డిఎస్‌సి నియామకాలు, 610 నియామకాలు, అంతర్ జిల్లాల, అంతర్ రాష్ట్రాల బదిలీల్లో వచ్చిన ఉపాధ్యాయుల నుం చి వివరాలను నమోదు చేస్తున్నారు. ఏటా వేసవి సెలవుల్లో బదిలీలు జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం గతంలో ప్రకటించింది. అందులో భాగంగానే ఈ కసరత్తు చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో నిబంధనలు, మార్గదర్శకాల మేరకు జాబితాను సిద్ధం చేస్తున్నామని, అన్ని కేటగిరీల్లోని పోస్టులకు సంబంధించిన ఉపాధ్యాయుల వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరిచే విధంగా చర్యలు తీసుకుంటున్నామని డిఇఒ తిరుమల చైతన్య తెలిపారు.


ఆశాజనకంగా ఉన్న మొక్కజొన్న పంట


విస్తారంగా మొక్కజొన్న సాగు

లావేరు: మండలంలోని ప్రతి గ్రామంలో మొక్కజొన్న పంట సాగు రైతులు చేపట్టారు. మండల వ్యాప్తంగా సుమారు 5 వేల ఎకరాలకుపైగా మొక్కజొన్న సాగు చేస్తున్నారు. తెగుళ్ల బెడద ఉన్నప్పటికీ పురుగు మందులు, గడ్డి మందలు, కలుపు నివారణ మందులు కొడుతూ పంటను రైతులు కాపాడుకుంటున్నారు. ఒక్కో ఎకరానికి పెట్టుబడి రూ.20 వేలు పైబడి ఖర్చు అవుతుంది. ఆరుతడి పంటగా ఉండడంతో అధిక శాతం రైతులు మొక్కజొన్న పంటనే సాగు చేస్తున్నారు. ఈ సీజన్లలో దిగుబడులు వస్తాయని రైతులు నమ్మకంతో ఉన్నారు. మండలంలోని లావేరు, లావేటిపాళెం, కేశవరాయపురం, జీజీవలస, గోవిందపురం, తాళ్లవలస, గురుగుబిల్లి, రావివలస, అప్పాపురం, రామునిపాళెం, పెదలింగాలవలస, వెంకటాపురం, పోతయ్యవలస, ఆదపాక, కొత్తకుంకాం, పాతకుంకం, గుర్రాలపాళెం, గుమ్మడాం, బుడుమూరు తదితర గ్రామాల్లో మొక్కజొన్న పంటే ప్రధాన పంటగా రైతులు సాగు చేస్తున్నారు. ఇప్పటికే పంట ఆశాజనకంగా ఉండడంతో దిగుబడులు బాగా రావచ్చనే ఆశతో రైతులు ఉన్నారు.

ముమ్మరంగా సిమెంట్ రోడ్లు

లావేరు: మండలంలోని తాళ్లవలస పంచాయతీ రావివలసలో సిమెంట్ రోడ్లు నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి పరంగా ఒక్క సిమెంట్ రోడ్డు, కాలువగాని నిర్మాణం కాకపోవడంతో గ్రామాల్లోని వీధుల్లో వర్షం వస్తే అంతా బురద మాయంగా వుంటూ నడవలేని పరిస్థితి ఉండేది. కాలువలు లేక మురుగు నీరు వీధిరోడ్లపై ప్రవహించి రోగాల బారిన ప్రజలు పడేవారు. కూటమి ప్రభుత్వంలో రావివలస గ్రామానికి రూ.10 లక్షల నిధులు మంజూరు చేయడంతో స్థానిక టిడిపి నాయకుడు దారపురెడ్డి కూర్మరావు సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు చేయిస్తున్నారు. గ్రామంలో ఇప్పటికే రెండు వీధుల్లో రెండు రోడ్లు నిర్మాణ పనులు పూర్తి చేయడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తేనే గ్రామాల అభివృద్ధి చెందుతాయని గ్రామస్తులు అంటున్నారు.


రావివలసలో నూతనంగా వేసిన సిమెంట్ రోడ్డు


చిత్రపటాన్ని స్వీకరిస్తున్న గాయని సునీత

గాయని సునీత అరసవల్లి సందర్శన

శ్రీకాకుళం అర్బన్: సినీ నేపథ్య గాయని సునీత ఉపద్రష్ట ఆదివారం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించారు. కుటుంబ సభ్యులతో కలిసి అరసవల్లి చేరుకున్న ఆమెకు ఆలయ మర్యాదలతో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతించారు. ఆలయంలో స్వామివారికి నిర్వహించిన పలు సేవల్లో పాల్గొన్న అనంతరం అనివేటి మండపంలో ఆలయ ఇఒ వై. భద్రాజీ శేషవస్త్రాన్ని, చిత్ర పటాన్ని అందజేశారు.

రూ.11.46 లక్షల ఆదాయం

మాఘ మాసం ఆదివారం కావడంతో సూర్యనారాయణ స్వామి ఆలయానికి రద్దీ పెరిగింది. దీంతో ఆలయానికి ఒక్కరోజు రూ.11,46,410 ఆదాయం సమకూరింది. యాత్రికులకు విక్రయించిన టికెట్లు రూ.8,15,000, విరాళాల రూపంలో రూ.1,08,740, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2,22,670 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఇఒ భద్రాజీ తెలిపారు.



అమ్మకాలు లేక వెలవెలబోతున్న చికెన్ దుకాణం

డీలాపడ్డ చికెన్ అమ్మకాలు

ప్రజాశక్తి- టెక్కలి

మాంసాహార ప్రియులకు అమితంగా ఇష్టపడే చికెన్ అమ్మకాలు టెక్కలిలో ఆదివారం డీలాపడ్డాయి. బర్డ్‌ఫ్లూ వ్యాధి ప్రభావంతో చికెన్ అమ్మకాలు ఒక్కసారిగా పడిపోవడంతో వ్యాపారస్తులు ఆందోళనకు గురయ్యారు. ఆదివారం చికెన్ అమ్మకాలు పడిపోవడానికి బర్డ్‌ఫ్లూ వ్యాధి ప్రచారం ఒకటి కాగా మాఘ మాసం కావడం, అదే రోజు వివాహలు, గృహ ప్రవేశాలు వంటి శుభ కార్యాలు అధికంగా ఉండడం కూడా ఒక కారణంగా చెప్పుకోవచ్చు. రాష్ట్ర పశు సంవర్థక శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో కోళ్లకు సంభవిస్తున్న బర్డ్ ఫ్లూ వ్యాధి లేదని ఒకపక్క పశుసంవర్థక శాఖాధికారులు చెబుతున్నప్పటికీ సోషల్ మీడియా ప్రచారం మాంసాహార ప్రియుల నోళ్లు కట్టివేశాయి. టెక్కలి నియోజకవర్గం పరిధిలోని టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల పరిధిలో సుమారు వంద వరకు చికెన్ దుఖాణాలు ఉంటగా దిమిలాడ, నీలాపురం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి వంటి పట్టణాల్లో సుమారు 8 వరకు పౌల్ట్రీ (కోళ్ల) పరిశ్రమలున్నాయి. నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన చికెన్ అమ్మకాల దుఖానాలకు ఈ పరిశ్రమల నుంచే కోళ్ల సరఫరా జరుగుతుంటాయి. వీటిలో అధికంగా సుగుణ, వెన్‌కాబ్, వి.హెచ్.ఎల్, స్నేహ వంటి కంపెనీలకు చెందిన కోళ్ల అమ్మకాలు జరుగుతుంటాయి. సాధారణ రోజుల్లో కంటే ఆది, మంగళ వారం వంటి రోజుల్లో ఒక్కొక్క దుఖానం సుమారు రూ.15 వేల నుంచి రూ.20 వేలు వరకు అమ్మకాలు సాగిస్తుంటే ఈ ఆదివారం ఒకొక్క దుఖానం మాత్రం కనీసం రూ.5 వేలు వరకు కూడా వ్యాపారం చేయలేకపోవడం గమనార్హం. వ్యాధి ప్రబలిందని ప్రచారం జరుగుతున్నప్పటి నుంచి అమ్మకాలు తగ్గాయని వ్యాపారస్తులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే కోళ్లకు సంభవిస్తున్న బర్డ్‌ఫ్లూ వ్యాధి గడచిన వైసిపి ప్రభుత్వ హయాంలో సంభవించకపోవడం గమనించదగ్గ విషయమని పలువురు వ్యాపారస్తులు సందేహల్ని వ్యక్తం చేస్తున్నారు.

చికెన్ అమ్మకాలు తగ్గడం వలన కనీసం దుఖానంలో పనిచేసే కార్మికులకు వేతనం కూడా ఇవ్వలేని పరిస్థితి ఉందని పలువురు వ్యాపారస్తులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా ఆదివారం చికెన్ అమ్మకాలు తగ్గడంతో చేపలు, మటన్ అమ్మకాలు మాత్రం పెరగడం గమనార్హం. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించి చికెన్ వ్యాపారులను ఆదుకునే విధంగా చర్యలు తీసుకోవాలని వ్యాపారులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


కృష్ణారెడ్డి (ఫైల్)

ఇచ్ఛాపురం: మండలంలోని ధర్మపురం గ్రామం వద్ద ఆదివారం ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో అరకభద్ర గ్రామానికి చెందిన రంగాల కృష్ణారెడ్డి (62) మృతి చెందాడు. ఒక వివాహానికి ద్విచక్ర వాహనంపై అరకభద్ర నుంచి ధర్మపురం వెళ్తుండగా ప్రమాద వశాత్తు ట్రాక్టర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడుకి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కృష్ణారెడ్డి మృతిపై ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి నారాయణమ్మ సంతాపం వ్యక్తం చేశారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ప్రమాదానికి గురైన కారు

తృటిలో తప్పిన ప్రమాదం

కోటబొమ్మాళి: మండలం జాతీయ రహదారిలో జర్జంగి సమీపంలో ఆదివారం జరిగిన సంఘటనలో తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది. టెక్కలి నుంచి విశాఖపట్నం వెళ్తున్న కారు అదుపుతప్పి డివైడర్ ఎక్కి ఊగిసిలాడుతున్న సమయంలో అదే రహదారిలో వెనుక నుంచి వేగంగా వస్తున్న ఆయిల్ ట్యాంకర్ వేగాన్ని అదుపుచేసే సమయంలో కారుని స్వల్పంగా ఢీ కొట్టింది. ప్రమాదంలో కారు ముందుభాగం నుజ్జు అయింది. అయితే కారులో ఒక పురోహితులు ఉండగా ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. లారీని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని స్థానిక ఎస్ఐ వి.సత్యన్నారాయణ తెలిపారు.

'ప్రజాశక్తి' పలాస విలేకరికి మాతృ వియోగం


శాంతమ్మ (ఫైల్)

కవిటి: ప్రజాశక్తి పలాస విలేఖరి గోరు భాస్కరరావుకు మాతృ వియోగం కలిగింది. భాస్కర రావు తల్లి గోరు శాంతమ్మ (80) ఆదివారం సాయంత్రం గుండె పోటుతో మరణించారు. ఆమెకు ముగ్గురు కుమారులు. వీరిలో రెండో కుమారుడైన భాస్కరరావు గత పదేళ్లగా ప్రజాశక్తి విలేకరిగా పని చేస్తున్నారు. విషయం తెలుసుకున్న పలాస డిఒ ఉమా మహేశ్వరరావు, తోటి విలేకరులు భాస్కరరావును పరామర్శించి శాంతమ్మకు నివాళ్లర్పించారు. శాంతమ్మ మృతిపై ప్రజాశక్తి శ్రీకాకుళం ఎడిషన్ మేనేజర్ పి.కామినాయుడు సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మాజీ సైనికునికి నివాళి

ఆమదాలవలస: మండలంలోని లొద్దలపేటకు చెందిన మాజీ సైనికుడు పైడి కాంతారావు ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఇండియన్ ఆర్మీలో విధులు నిర్వహించి పదవి విరమణ అనంతరం శ్రీకాకుళంలోని ఎస్‌బిఐలో సెక్యూరిటీ గార్డ్‌గా విధులు నిర్వహిస్తూ కుటుంబంతో కలిసి భైరవానిపేటలో నివాసం ఉండేవారు. వారం రోజులుగా అనారోగ్యానికి గురైన ఆయన తుదిశ్వాస విడిచారు. భైరవాని పేటలో నిర్వహించిన అంత్యక్రియల్లో జిల్లాకు చెందిన మాజీ సైనికులు, స్టేట్‌బ్యాంకు ఉద్యోగులు పాల్గొని మృతదేహంపై జెండాను ఉంచి నివాళ్లర్పించారు. కాంతారావు మృతితో లొద్దలపేటలో విషాదఛాయలు అలము కున్నాయి.

భార్యపై దాడి.. భర్త అరెస్టు

నౌపడ: భార్యపై దాడికి పాల్పడి, వేధింపులు గురి చేస్తున్న భర్తను అరెస్టు చేసినట్లు ఆదివారం నౌపడ పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు సంతబొమ్మాళి మండలం నౌపడ పంచాయతీ కూర్మనాథపురం గ్రామానికి చెందిన పరపటి సాగర్, సుమలత భార్యాభర్తలు. గత నెలలో సంక్రాంతి పండుగ సమయంలో భార్యను చిత్రహింసలకు గురిచేసి గాయపరిచాడు. దీంతో భార్య సుమలత ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం నిందితునికి 14 రోజుల రిమాండ్ విధించి నరసన్నపేట సబ్‌జైలుకు తరలించా మన్నారు.

మూగ చిన్నారిపై కుక్కల దాడి


గాయపడిన శ్యామల

పొందూరు: మేజర్ పంచాయతీ పరిధి అలబోయిన పేట మంగళకాలనీ సమీపంలో వీధి కుక్కలు మూకుమ్మడిగా చేసిన దాడిలో మంగళకాలనీకి చెందిన ఎనిమిదేళ్ల మూగ చిన్నారి శెనగల శ్యామల తీవ్రంగా గాయపడింది. మూగ, చెవిటి అంగ వైకల్యంతో బాధ పడుతున్న చిన్నారి శ్యామల స్నేహితులతో కలిసి సమీపంలో పెళ్లి విందుకు వెళ్లి వస్తుండగా అక్కడే ఉన్న ఆరువీధి కుక్కలు వెనుకనుంచి ఒక్కసారిగా దూసుకు వచ్చాయి. మిగిలిన పిల్లలు భయపడి పారిపోగా కుక్కలు అరుపులు వినిపించకపోవడంతో చిన్నారి అక్కడే ఉండిపోయింది. కుక్కలు శ్యామలపై దాడి చేయడంతో పలుచోట్ల కుక్కకాట్లతో తీవ్రంగా గాయ పడింది. అటుగా వెళ్తున్న వారు గమనించి కుక్కలను చెదరగొట్టి చిన్నారిని కాపాడారు. గాయపడిన చిన్నారిని పొందూరు ఆస్పత్రికి తరలించి చికిత్స అంది ంచారు. కుక్కలదాడులు రోజురోజుకు పెరిగి పోతుండ డంతో పిల్లల తల్లిదండ్రులు పిల్లలను పాఠశా లకు, బయటకు పంపించడానికే భయపడి పోతున్నారు.

కుటుంబీకులు గుర్తించి తీసుకెళ్లాలి

బూర్జ: ఏడాది కాలంగా ఓల్డేజ్ హోంలో ఆశ్రయం పొందుతున్న వ్యక్తిని తమ కుటుంబీకులు ఎవరైనా గుర్తుపట్టి తీసుకెళ్లాలని సహాయమాత ఓల్డేజ్ హోం సిబ్బంది ప్రకటనలో తెలిపారు. అలాగే స్థానిక ఎస్ఐ ప్రవల్లికకు సమాచారం అందించామని తెలియజేశారు. గతేడాది నరసన్నపేటలో జరిగిన ప్రమాదంలో బాధితురాలిని రిమ్స్ ఆస్పత్రికి తరలించగా బాధితురాలి కాళ్లకు బలమైన గాయం కావడంతో చికిత్స అందించిన అనంతరం తన కుటుంబీకులు ఎవరూ రాకపోవడంతో సహాయమాత ఓల్డేజ్ హోం పాలవలసలో చేర్పించారని తెలిపారు. ఏడాది కాలంగా ఓల్డేజ్ హోంలో ఉంచామని ఓల్డేజ్ హోం సిబ్బంది తెలిపారు.

ఆలయ కమిటీ సమావేశం

లావేరు : మండలంలోని బెజ్జిపురంలోని ఉమా రామ లింగేశ్వరస్వామి ఆలయం 8వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఆలయకమిటీ సభ్యులు ఆదివారం ఆలయ ప్రాంగణంలో సమావేశమై తీర్మానించారు. ఈనెల 25 నుంచి మార్చి 2 వరకు గ్రామంలో అందరూ మాంసాహారానికి దూరంగా ఉండాలని నిర్ణయించారు. మేడూరి ప్రసాద రావు, మాజీ సర్పంచ్ ఇజ్జాడ శ్రీను వాసరావు, మాజీ జెడ్‌పిటిసి పిన్నింటి మధుబాబు, సభ్యులు పి.గోవింద నాయుడు, దన్నాన శ్రీను వాసరావు, వడ్డిపల్లి శ్రీనువాసరావు, గంట్యాడ అప్పల నాయుడు, కలిశెట్టి ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.